

రహదారులు, భవనాలశాఖపై క్యాంపు కార్యాలయంలో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు లక్ష్మారెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అధికారులు

# ఆదర్శానికి దారితీద్దాం

- రహదారుల నిర్మాణం, నిర్వహణలో తెలంగాణ ముందుండాలి
- వచ్చే పదేళ్ల అవసరాలపై ప్రణాళిక రూపొందించాలి
- మలుపులను తగ్గించి ప్రమాదాలను నియంత్రించండి
- దార్శనిక పత్రం రూపొందించాలి
- సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు – హైదరాబాద్

'రాష్ట్రంలో రహదారులు ఎలా ఉన్నాయి? మెరుగైన రహదారుల వ్యవస్థ ఎలా ఉండాలి? ప్రతికూల వాతావరణంలోనూ తట్టుకోగలిగే రహదారుల నిర్మాణం ఎలా? వచ్చే పదేళ్లకు రాష్ట్ర అవసరాలు ఏమిటి? తదితర అంశాలపై దార్శనిక పత్రాన్ని రూపొందించండి. రహదారుల నిర్మాణం, నిర్వహణలో రాష్ట్రం అవలంబించే విధానాలు దేశానికే ఆదర్శంగా నిలవాలి' అని తెలంగాణ రాష్ట్ర ముఖమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారమిక్కడ తన క్యాంపు కార్యాలయంలో రహదారులు, భవనాల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మెరుగైన రహదారుల వ్యవస్థను రూపొందించేందుకు భవిష్యత్తులో అనుసరించాల్సిన విధానాలు, జాతీయ రహదారులుగా మార్చాల్సిన రోడ్లు, కేంద్రం ద్వారా చేపట్టాల్సిన మార్గాలు.. తదితర అంశాలు కూడా దార్శనిక పత్రంలో ఉండాలి. రహదారులను ప్రమాదరహితంగా రూపొందించాలి' అని చెప్పారు.

## రోడ్ల నాణ్యతే కీలకం..

'రాష్ట్రంలోని రవాణా వ్యవస్థ మెరుగుదలలో రోడ్ల నాణ్యతే కీలకం. ఎక్కడ ఎలాంటి రహదారులు అవసరమో గుర్తించి అందుకు తగ్గట్లుగా నిర్మాణాలు చేపట్టాలి. వర్షం వస్తే (మిగతా 2లో)

# ఆదర్శానికి దారితీద్దాం

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతినే ప్రాంతాలను గుర్తించి అక్కడ మరింత పటిష్ఠమైన రహదారులను నిర్మించాలి. రోడ్లు తరచూ దెబ్బతినకుండా ఐరోపా, అమెరికా దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి. నిత్యం రోడ్డు ప్రమాదాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడుతున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న మలుపులను తొలగించాలి. అవసరమైన ప్రాంతాల్లో కల్వర్టులు, వంతెనలను నిర్మించాలి. ఈ అంశాలను కూడా దార్శనిక పత్రంలో పేర్కొనాలి. రోడ్ల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. అన్ని ప్రాంతాలను సమదృష్టితో చూస్తూ అవసరాల ప్రాతిపదికన నిర్మాణాలు చేపడుతున్నాం. కేంద్రం నుంచి 2,500 కి.మీ. మేర జాతీయ రహదారులు మంజూరు చేయించగలిగాం. కేంద్రానికి రహదారులు బదిలీ అయ్యే వరకు వాటికి రాష్ట్ర ప్రభుత్వమే మరమ్మతులు చేపట్టాలి. రహదారుల వెంట పెరుగుతున్న పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలి' అని కేసీఆర్ పేర్కొన్నారు.

**ప్రాంతీయ రింగు రోడ్డు..:** 'హైదరాబాద్ చుట్టూ 330 కి.మీ. ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలి. రెండేళ్లలో పనులు పూర్తయ్యేలా చూడాలి. సమగ్ర అధ్యయన నివేదిక తయారీలో జాప్యం జరుగుతోంది. త్వరగా వాటిని సిద్ధం చేయాలి. ఆ తర్వాత భూసేకరణ చేపట్టాలి. జాతీయ, రాష్ట్ర, పట్టణ రహదారులు పెద్ద గ్రామాల నుంచి కాకుండా బయటనుంచి వెళ్లేందుకు వీలుగా బైపాస్ రోడ్లను నిర్మించాలి. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించాలి'అని కేసీఆర్ అధికారులకు స్పష్టంచేశారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు తుమ్మల, లక్ష్మారెడ్డి, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, సునీల్‌శర్మ, ఈఎన్‌సీలు రవీందర్‌రావు, గణపతిరెడ్డి పాల్గొన్నారు.